ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


కడప

జిల్లా వార్తలు

3

బుధవారం 6 మార్చి 2024




నోటిఫికేషన్‌కు ముందే..

నోట్లాట..!

- ప్రొద్దుటూరు కేంద్రంగా జోరుగా బెట్టింగ్‌లు
- ఉమ్మడి జిల్లాలో ఈసారి టీడీపీకే మెజారిటీ సీట్లు
- ప్రభుత్వం టీడీపీదే అంటూ రూ.లక్షకు రూ.3లక్షలు పందేలు
- జిల్లాలో టీడీపీ అభ్యర్థుల మెజార్టీపై కూడా బెట్టింగ్‌లు
- కమలాపురంలో మెజార్టీ 10వేలు దాటుతుందంటూ లక్షకు 3లక్షలు బెట్టింగ్
- ఎన్నికల షెడ్యూలు విడుదల కాకముందే వందల కోట్ల పందేలు

సీఎం జగన్మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ 2004 ఎన్నికలకు ముందు ఫలితాలను సాధించనుందా.. జగన్ ప్రభుత్వంపై సొంత జిల్లావాసులకే విరక్తి కలిగిందా.. అభివృద్ధిని వదిలేసి కేవలం ప్రత్యర్థులను టార్గెట్ చేయడం, విలువైన ఆస్తులను కొల్లగొట్టేయడంతో జనం ఆందోళన చెందుతున్నారా... మళ్లీవస్తే ఉన్న ఆస్తులూ ఊడలాక్కుంటారని భావిస్తున్నారా.. అందుకే ఈసారి చంద్రబాబును గెలిపించుకుందామని ఓటర్లు డిసైడ్ అయ్యారా.. ఈ ప్రశ్నలన్నింటికీ జిల్లాలో జరుగుతున్న బెట్టింగ్ తీరును చూస్తే అవుననే అనిపిస్తుంది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే జిల్లాలో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. ఎంతలా అంటే ఇవి వందల కోట్లకు చేరాయని అంటున్నారు. చంద్రబాబు సీఎం అవుతారని, ఉమ్మడి జిల్లాలో మెజారిటీ స్థానాల్లో టీడీపీ గెలుస్తుందని పందేలు కాస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీకి ఎంత మెజారిటీ వస్తుందనే విషయంపైనా పందెం కాస్తున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ పార్టీ పెట్టిన తరువాత ఉమ్మడి జిల్లాలో 2014లో రెండు పార్లమెంటు, 9 అసెంబ్లీ స్థానాలను దక్కించుకున్నారు. 2019లో క్లీన్‌స్వీప్ చేశారు. అయితే ఈసారి జరిగే ఎన్నికల్లో కొన్నిచోట్ల ఫ్యాను రెక్కలు ఊడే పరిస్థితి కనిపిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ మేరకు ప్రొద్దుటూరు కేంద్రంగా జరుగుతున్న బెట్టింగ్ వ్యవహారాన్ని పరిశీలిస్తే అర్థమవుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మెజారిటీ స్థానాల్లో టీడీపీ గెలుస్తుందనే ప్రచారం ఉంది. ఈ మేరకు బెట్టింగ్‌లు జోరందుకున్నాయి.

నెక్స్ట్ సీఎం చంద్రబాబే

కడప జిల్లా ఫ్యాక్షన్‌కు, కవులకు, కళలకు ఎలా నిలయమో బెట్టింగ్‌కు కూడా అంతే ప్రసిద్ధి. ఇక్కడ అంతర్జాతీయ క్రికెట్, ఐపీఎల్‌తో పాటు వివిధ దేశాల్లో జరిగే రంజీమ్యాచ్‌ల లాంటివాటికి కూడా బెట్టింగ్‌లు కాస్తారు. అంతెందుకు జాతీయ రహదారుల్లో నిలబడి ఇప్పుడు ఫలానా నెంబరు బండి వస్తుందని పందేలు కడతారు. ఉదాహరణకు ఏపీ04 ఎపీ 6092 బండి వెళ్లిందనుకుంటే దాని తరువాత వచ్చే బండ్ల నెంబర్లపై కూడా బెట్టింగ్ కాస్తారు. ఇక ఎన్నికల ఫలితాలే కాదు అభ్యర్థుల ఎంపిక నుంచి బెట్టింగ్ కాస్తారు. జిల్లాలో టీడీపీ నుంచి ఎవరెవరు పోటీ చేస్తారనే దానిపై కూడా బెట్టింగ్‌లు జరిగాయి. అయితే ఇప్పుడు నెక్స్ట్ సీఎం చంద్రబాబు అనే దానితో పాటు జిల్లాలో 4 నుంచి 6 స్థానాలు టీడీపీ గెలుస్తుందన్న దానిపై కూడా పందేలు కాస్తున్నట్లు సమాచారం.

మెజారిటీపైనా పందేలు..

టీడీపీ గెలుస్తుందనే కాదు.. మెజారిటీపైన కూడా పందేలు కాస్తున్నారు. కడప పార్లమెంటు పరిధిలో కడప, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు ప్రస్తుతానికి టీడీపీ గెలిచే స్థానాలుగా బాగా ప్రచారం జరుగుతోంది. వైసీపీ కూడా ఇక్కడ ఈసారి తమకు ఓటమి తప్పదనే భయంతో ఉందంటారు. కడప టీడీపీ ఇన్‌చార్జి మాధవీరెడ్డి నిత్యం జనాల్లో ఉంటూ ఫైర్‌బ్రాండ్‌లా దూసుకెళుతున్నారు. 20 ఏళ్ల తర్వాత కడపలో టీడీపీకి మాంచి క్రేజ్ వచ్చినట్లు చర్చ ఉంది. ఇక మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్ కష్టపడుతున్నారు. కమలాపురంలో పుత్తా నరసింహారెడ్డి ఈసారి ఎలాగైనా గెలవాలనే కసితో ఉన్నట్లు చెబుతారు. జమ్మలమడుగులో భూపేశ్ రెడ్డి నిత్యం జనం మధ్య ఉంటున్నారు. ఈ ప్రాంతాల్లో వైసీపీ నేతల దందాలు, దౌర్జన్యాలు, తప్పుడు కేసులు ఇవన్నీ వీరికి కలిసి వచ్చాయంటారు. అందుకే జనాల్లో కూడా ఈ స్థానాలు టీడీపీవేనని చర్చ సాగుతోందంటారు. ఇక్కడ టీడీపీ మెజార్టీపై కూడా పందేలు జరగడం విశేషం. కమలాపురంలో పుత్తా నరసింహారెడ్డి 10వేల ఓట్లతో గెలుస్తారంటూ లక్షకు 3 లక్షల చొప్పున పందేలు కాస్తున్నట్లు సమాచారం. కడప, మైదుకూరులో టీడీపీ అభ్యర్థులు మంచి మెజారిటీతో గెలుస్తారని పందేలు కాసినట్లు తెలుస్తోంది.

ప్రొద్దుటూరు కేంద్రంగా..

ప్రొద్దుటూరు గోల్డ్ బిజినెస్‌కు రెండో ముంబై. అలాగే అన్ని రకాల బెట్టింగ్‌లకు ఇదో అడ్డా అని చెబుతారు. అందుకే ఇప్పుడు పసిడిపురి కేంద్రంగా.. మళ్లీ సీఎం చంద్రబాబు అని, ఉమ్మడి జిల్లాలో 4 నుంచి 6 సీట్లు టీడీపీకి వస్తాయని పందేలు కాస్తున్నారు. నెక్స్ట్ సీఎం చంద్రబాబే అని లక్షకు మూడు లక్షలు, కొందరు లక్షకు 1.60, 1.80, 2లక్షలు చొప్పున పందేలు కట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ - జనసేన కూటమి వచ్చే ఎన్నికల్లో 107 నుంచి 130 సీట్ల మధ్య గెలుచుకుంటుందని పందేలు కాస్తున్నారు. టీడీపీ జనసేన కూటమి అధికారంలోకి వస్తుంది అంటూ టీడీపీ తరఫున లక్షకు రెండు లక్షలు బెట్టింగ్ కడుతున్నట్లు చెబుతున్నారు. గ్రేటర్ రాయలసీమలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ఒంగోలులో కూడా టీడీపీ, వైసీపీ సీట్లపైన కూడా భారీ ఎత్తున బెట్టింగ్ కాసినట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందే వందల కోట్లలో పందేలు కాస్తుండటం విశేషం.

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ జామ్ అయి నిలిచిన భారీ వాహనాలు



నిత్యం ట్రాఫిక్ జామ్

- పట్టించుకోని అధికారులు
- పులివెందుల ప్రజలకు తప్పని ఇబ్బందులు

పులివెందుల టౌన్, మార్చి 5: పులివెందులలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. డివిజన్ కేంద్రంగా మారడంతో పులివెందులకు ఇతర మండలాల నుంచి వాహనాల రాకపోకలు ఎక్కువ కావడంతో రద్దీ పెరుగుతోంది. పట్టణంలో షాపులు, షోరూంలు, సూపర్‌మార్కెట్‌లు ఎక్కువ ఉండడంతో జనసంచారంతో పాటు వాహన రాకపోకలు ఎక్కువయ్యాయి. మరోపక్క ఆయా షాపుల యజమానులు పగటి పూటే ఇతర ప్రాంతాల నుంచి వస్తువులను దిగుమతి చేసుకోవడంతో ఆ రోడ్లలో భారీ వాహనాలు నిలిపి స్టాక్ అన్‌లోడ్ చేసే క్రమంలో మిగతా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభన ఏర్పడుతోంది. ప్రధానంగా కడపరోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో అరటికాయల లారీలతో మరింత ఇబ్బందిగా మారింది. దీనితో ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణంలో మెయిన్‌రోడ్డు మోడల్ టౌన్‌లో భాగంగా బోలేవార్డు పనులు చేపట్టడంతో రోడ్డు విస్తరణ పనులు సరిగ్గా జరగక రద్దీ మరింత పెరుగుతోంది. ఈ రోడ్లలో వెళ్లాలంటే నరకప్రాయంగా మారింది. అలాగే పూలంగళ్ల సర్కిల్ వద్ద తోపుడుబండ్లను నిలిపి ఉంచడంతో వాహన రాకపోకలకు అంతరాయ కలుగుతోంది. పూలంగళ్ల సర్కిల్ నుంచి పాత ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఆ రోడ్లలో వెళ్లాలంటే ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్నపల్లె బస్టాండ్ సెంటర్‌లో భారీ వాహనాలు మలుపు తిరిగే సమయంలో అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వాహనాలు నిలిచిపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా నియమించిన పోలీసు సిబ్బంది సహనం కోల్పోయి విధులు చేయలేక పోతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు భారీ వాహనాలకు పగటిపూట అనుమతులు నిలిపి వేయాలని పులివెందుల ప్రజలు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన వాయిదా

పులివెందుల, మార్చి 5: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు మంగళవారం అడిషనల్ పీఎస్ టు సీఎం కె.నాగేశ్వరరెడ్డి అధికారిక ఉత్తర్వులు ఇచ్చారు. ముఖ్యమంత్రి ఈనెల 7, 8 తేదీలలో పులివెందుల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించాల్సి ఉంది. అయితే ఈ పర్యటన వాయిదా పడినట్లు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి

- కలెక్టర్ వి.విజయరామరాజు

మైదుకూరు, మార్చి 5: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ వి.విజయరామరాజు కోరారు. మంగళవారం ఆయన మైదుకూరులో సమస్యాత్మకంగా గుర్తించిన మూలబాట పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో వెంకటరమణ, పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక నాయకులు, ప్రజలతో మాట్లాడుతూ.. ఎన్నికల పోలింగ్‌ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులకు సహకరించాలని కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపడతామన్నారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.



మైదుకూరులోని మూలబాట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వి.విజయరామరాజు

నీరు లేక ఎండుతున్న నువ్వుల పంట



ఒక్క తడి నీరిచ్చింటే..

- కేసీ ఆయకట్టుకింద ఎండుతున్న ఆరుతడి పంటలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్నరైతులు

చెన్నూరు, మార్చి 5: ప్రభుత్వం నీరు ఇస్తుంది.. ఆరుతడి పంటలు సాగు చేసుకుంటాం.. ఫిబ్రవరి వరకు నీరు వస్తే కాసింత గట్టెక్కి ఇబ్బందులు లేకుండా ఉంటామని అనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. కేసీ కాలువలో నీరు రాకపోవడంతో ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయి. మండల వ్యాప్తంగా కేసీ ఆయకట్టు కింద రబీలో జొన్న, నువ్వులు, వరి, కొర్ర, ప్రొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేశారు. వీటిని డిసెంబరులో సాగు చేయగా ఫిబ్రవరి వరకు నీరు వస్తాయని ఇబ్బంది లేకుండా గట్టెక్కుతామని రైతులు అనుకున్నారు. అధికారులు కూడా కేసీ ఆయకట్టు కింద ఎవ్వరూ వరి సాగు చేయవద్దని ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని ప్రకటించారు. దీంతో ఆరుతడి పంటలకు ఇబ్బంది ఉండదని రైతులు భావించారు. ఆరుతడి పంటలు సాగు చేశాక.. ఇక నీరివ్వం, పంటలు సాగు చేసుకోవద్దని ప్రభుత్వం ప్రకటించిందని రైతులు వాపోతున్నారు. కేసీ కాలువలో చుక్క నీరు కూడా లేక పూర్తిగా ఎండిపోయింది. దీంతో వరి కాదు కదా.. సాగులో ఉన్న ఆరుతడి పంటలు సైతం చేతికి అందే పరిస్థితి లేదు. ఫిబ్రవరి 15 వరకు నీళ్లు ఇచ్చినా.. లేదా కనీసం ఒక్క తడి నీరిచ్చింటే ఈ ఆరుతడి పంటలన్నీ గట్టెక్కి తాము బాగుపడేవాళ్లమని రైతులు పేర్కొంటున్నారు. ఇంత దారుణంగా మమ్మల్ని నష్టపరుస్తారా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో నీరు సరిగా రాలేదు.. రబీలో అసలే లేదు. కనీసం ఒక్క పంట అయినా చేతికి అందకుండా పోయిందని రైతులు బాధపడుతున్నారు. మొత్తంమీద కేసీ ఆయకట్టు కింద గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది పంటలు నష్టపోవడంతో అప్పుల భారం మరింత పెరుగుతుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీరు లేక ఖాళీగా ఉన్న కేసీ కాల్వ



నమ్ముకుని నష్టపోయాం..

కనీసం రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు గట్టెక్కేందుకయినా ప్రభుత్వం నీరు ఇస్తుందని నమ్మి నష్టపోయాం. నేను జొన్న సాగు చేశా. ప్రస్తుతం గింజ పోసుకునే దశలో నీరు రాకపోవడంతో గింజ రాలేదు. పైకి కంకి మాత్రం కనిపిస్తుంది. ఈ పంటంతా కోసి ఆవులకు వేయాలనుకుంటున్నా. నాతో పాటు కేసీ ఆయకట్టు కింద ఇప్పుడు సాగు చేసిన రైతులంతా నష్టపోయారు.

- శింగరయ్య, రైతు చెన్నూరు





మల్లేశ్వరస్వామి మూలవిరాట్

మహిమాన్వితం పొలతల క్షేత్రం

- శివరాత్రి పర్వదినానికి సర్వం సిద్ధం
- రేపటి నుంచి ఉత్సవాలు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

పెండ్లిమర్రి, మార్చి 5: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రాలలో పొలతల పార్వతీసమేత మల్లేశ్వరస్వామి ఆలయం ఒకటి. పెండ్లిమర్రి మండలం గంగన్నపల్లె పంచాయతీ పరిధిలోని శేషాచల పర్వతశ్రేణుల్లోని పాలకొండల్లో పొలతల మల్లేశ్వరస్వామి కొలువై ఉన్నాడు. ఏటా మహాశివరాత్రి పర్వదినం రోజు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఇక్కడ పార్వతీసమేత మల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అక్కదేవతలు, పులిబండెన్న, వినాయక, సుబ్రహ్మణ్యస్వామి, పుట్ట ఆంజనేయస్వామి, కాశిరెడ్డినాయన నిత్యం పూజలు అందుకుంటారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు పొలతల క్షేత్రం శివనామస్మరణతో శంభో శివ శంభో అంటూ మారుమోగనుంది. అన్ని శాఖల అధికారులు తాగునీరు, విద్యుత్, శానిటేషన్, చలువపందిళ్లు, ట్రాఫిక్ తదితర ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సర్వం సిద్ధం చేశారు.

పొలతల స్థల పురాణం

లోక కల్యాణార్థం శివపార్వతులు ఆకాశంలో సంచరిస్తూ పొలతల క్షేత్రంలో కాలుమోపగా కొంతభూమి కుచించుకుపోయింది. ప్రస్తుతం శివాలయం ఉన్న ప్రాంతంలో శివపార్వతులు కాలుమోపగా అక్కడ ఓంకార శబ్దంతో గంగ శిలలు ప్రత్యక్షమయ్యాయి. ఈ శిలలు కఠినమైనందున పులితలలాగా గట్టిగా ఉండడంతో మొదట పులి తలగా ప్రసిద్ధిచెంది కాలక్రమేణా పొలతలగా మారింది. కృతయుగంలో సీతమ్మ కోసం అన్వేషిస్తూ వచ్చిన రామలక్ష్మణులు పొలతల క్షేత్రంలోని కొలనులో స్నానమాచరించి మల్లేశ్వరుడిని దర్శించుకున్నారని స్థానిక కథనం. ద్వాపరయుగంలో పాండవుల వనవాస కాలంలో అర్జునుడు పొలతలకు వచ్చి స్వామిని పూజించినందున మల్లికార్జునుడుగా ప్రసిద్ధిచెందాడని మరో కథనం.

అక్కదేవతలు

పొలతలలో అన్న బండెన్న, ఏడుగురు అక్కదేవతలైన పెద్దవారమల్లమ్మ, చిన్నవారమల్లమ్మ, నాగముణెమ్మ, దేవకన్యక, సూర్యకన్యక, చంద్రకన్యక, మల్లమ్మలు ఇక్కడ వెలసి నిత్య మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తుండేవారు. మహిళలు తడి వస్త్రాలతో అక్కదేవతల వద్ద ప్రార్థిస్తే భూతప్రేత పిశాచాలు దగ్గరకురావని, సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం.

శేషాచల పర్వతంలో

శేషాచల పర్వత శ్రేణుల్లో తలభాగంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల వేంకటేశ్వరస్వామి, నడుము భాగంలో పొలతల మల్లేశ్వరస్వామి, తోకభాగంలో గండి ఆంజనేయస్వామి కొలువై ఉన్నారు. అందుకే భక్తులు శివరాత్రి రోజున పొలతల చేరుకుని జాగారం చేస్తే.. మరుసటి రోజు గండి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు.

జంతు బలులు

పొలతల శైవక్షేత్రం అయినప్పటికి పులి బండెన్నస్వామి వద్ద భక్తులు జంతుబలులు సమర్పిస్తారు. అలాగే ఇంటి దేవుడైన మల్లేశ్వరునికి పూజలు చేసి బండెన్న ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఆలయం వద్దకు మహిళలకు ప్రవేశం నిషిద్ధం. ఇక్కడ జంతుబలులు సమర్పించి తినేందుకు కూడా మహిళలకు ప్రవేశం లేదు. ఒకవేళ మాంసం మిగిలితే బండెన్న స్వామి ఆలయ పరిసరాల నుంచి మాంసాన్ని బయటకు తెచ్చుకోకూడదు. ఇక్కడ ఎక్కడా లేని విధంగా ఆవులు మాంసాన్ని తినడం విశేషంగా చెప్పుకోవచ్చు.

అన్నదానం

మల్లేశ్వరస్వామి ఎదురుగా వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిత్యం అన్నదానం చేస్తుంటారు. ఒక్క శివరాత్రి రోజునే లక్షలాది మంది భక్తులకు అన్నిరకాలతో భోజనాన్ని వడ్డిస్తారు. అలాగే దేవస్థానం తరపున కూడ అధికారులకు, ఆలయ సిబ్బందికి, భక్తులకు అన్నదానం చేస్తారు. పొలతలకు వెళ్లే దారుల్లో, ఆలయం వెంబడి అన్న ప్రసాదాలు, మజ్జిగ, తాగునీటి సౌకర్యం దాతలు ఏర్పాటుచేస్తారు.



అక్కదేవతలు



అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశాం..

మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి తెలిపారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయని, మొదటి రోజు స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక దర్శనాలు, శుక్రవారం రోజున ఉదయం 10గంటలకు స్వామివారి కల్యాణం, రాత్రి స్వామి రథంపై కొలువుదీరి అక్కదేవతల ఆలయం వరకు వాయిద్యాలు, బాణసంచాల మధ్య ఊరేగుతారని అన్నారు. ఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తులకు వైద్య సదుపాయాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశామని తెలిపారు.

పొలతల క్షేత్రం



పొలతలలో ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

శివరాత్రి పర్వదినం నేపథ్యంలో మంగళవారం ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పొలతల క్షేత్రంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, డీటీసీ డీఎస్పీ రవికుమార్, ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





బండెన్నస్వామి మూలవిరాట్

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన సుబ్రమణ్యామాచారి

ఎర్రగుంట్ల, మార్చి 5: ఎర్రగుంట్ల మండలంలోని పెన్నానది సమీపంలోని రెడ్ల కల్యాణమంటపం సమీపంలో ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో పోట్లదుర్తికి చెందిన కోవెలకుంట్ల సుబ్రమణ్యామాచారి (62) మృతి చెందాడు. మెకానిక్ పనిచేస్తున్న సుబ్రమణ్యామాచారి పోట్లదుర్తి నుంచి బైక్‌లో ప్రొద్దుటూరుకు మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లాడు. రెడ్ల కల్యాణమంటపం వద్ద వెనుక వైపు నుంచి వచ్చిన కట్టుడు రాళ్లు తీసుకెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అతడి తల పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

చాపాడు, మార్చి 5: మండలంలోని వీవీ కొట్టాలు గ్రామానికి చెందిన ఏనుగు సుబ్బారెడ్డి (39), విజయనగరం గ్రామానికి చెందిన ఒక యువతి (29) వేర్వేరు ఆస్పత్రులలో చికిత్స పొందుతూ ఈనెల 4న సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఏనుగు సుబ్బారెడ్డి కడుపు నొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగి కడపలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వరకట్నం కోసం వేధించడంతో గతనెల 21వ తేదీ యువతి పురుగుల మందు తాగి కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 4వ తేదీన మృతి చెందినట్లు తెలిపారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

కుక్కల దాడిలో రెండు దుప్పిలు మృతి


పంచనామా చేస్తున్న పశు వైద్యురాలు

నందలూరు, మార్చి 5: కుక్కల దాడిలో రెండు దుప్పిలు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. రాజంపేట ఫారెస్ట్ రేంజర్ రామాపురం నారాయణ కథనం మేరకు... నందలూరు బీట్‌లోని గట్టుమీదపల్లె వద్ద వీధి కుక్కలు దాడి చేసిన సంఘటనలో ఒక్క దుప్పి, పాటూరు బీట్‌లోని రైల్వే ట్రాక్ సమీపంలో కుక్కలు తరమగా తప్పించుకుపోయే క్రమంలో పైనుండి కిందకు దూకి మరో దుప్పి మృతి చెందాయి. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిశంకర్, బీట్ ఆఫీసర్లు ఇందిర, లింగారెడ్డిలు మృతి చెందిన రెండు దుప్పిలను మంగళవారం స్థానిక పశువైద్యశాలకు తరలించారు. మండల పశువైద్యురాలు స్నిగ్ధ ప్రణీత పంచనామా చేసిన అనంతరం దహన సంస్కారాలు నిర్వహించినట్లు ఫారెస్ట్ రేంజర్ నారాయణ తెలిపారు.

ఉద్యాన తోటకు నిప్పు

● కాలిన సపోట చెట్లు, డ్రిప్పు ● రూ.1.50 లక్షలు రైతుకు నష్టం



కాలిపోయిన సపోటా చెట్లు, కాలిన డ్రిప్పు పరికరాన్ని చూపుతున్న రైతు

సంబేపల్లె, మార్చి 5: వేసవి కాలం వచ్చిందంటే చాలు, ఉద్యాన రైతులకు నిప్పుతో నష్టాలు తప్పడం లేదు. కొంతమంది ఆకతాయిలు నిప్పు పెట్టడంతో ఉద్యాన తోటలు అగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయలు రైతులకు నష్టం వాటిల్లుతోంది. సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామం జానంబండ్లపల్లెకు చెందిన రైతు జానం వేణుగోపాల్ రెండు ఎకరాల్లో ఉద్యాన తోట సాగు చేశాడు. మంగళవారం గుర్తు తెలియని వారు నిప్పంటించడంతో 150 సపోటా చెట్లు, డ్రిప్ పరికరాలు, 40 మామిడి చెట్లు కాలిపోయినట్లు రైతు ఆవేదన చెందాడు. నాలుగు సంవత్సరాలుగా వాటిని సంరక్షిస్తూ ఉన్నట్లు తెలిపారు. కళ్ల ముందు నిప్పు అంటుకొని కాలిపోతున్నా నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం జరిగిన నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని వేడుకొన్నాడు.

20 క్వార్టర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు, మార్చి 5 : మండల పరిధిలోని జంగంపల్లెలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 20 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైవీయూలో ఉర్దూ భాషా దినోత్సవం


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ షావల్లిఖాన్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 5 : ఉర్దూ భాష చదివే వారికి అవకాశాలు, ఉద్యోగ ఉపాధి ఉన్నాయని వైవీయూ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షావల్లిఖాన్ తెలిపారు. మంగళవారం వైవీయూ హ్యూమానిటీ బ్లాక్‌లో ఉర్దూ శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ దినోత్సవాన్ని ప్రొఫెసరు కె.రియాజున్నీసా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా షావల్లిఖాన్ మాట్లాడుతూ ఉర్దూను అభ్యసించే వారికి వేమన విశ్వవిద్యాలయం ఒక చక్కటి వేదిక అన్నారు. ఉర్దూ శాఖాభివృద్ధికి అందరి సహకరం ఉందన్నారు. హ్యూమానిటీస్ డీన్ ప్రొఫెసరు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అరబిక్, పర్షియన్, టర్కీ భాషల నుంచి ఉర్దూ భాష పుట్టిందన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ ప్రొఫెసరు రమాదేవి, పార్వతి, ఉర్దూ అధ్యాపకులు డాక్టర్ ఖాజాపీర్, ఖాజామైనుద్దీన్, నజీమున్నీసా, రెహనాపర్వీన్, సయ్యద్ ఇంతియాజ్, అహ్మద్ పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు

● కోరంలేక కౌన్సిల్ సమావేశం వాయిదా ● ఆగ్రహంతో వెళ్లిపోయిన చైర్మన్


ఖాళీగా ఉన్న కుర్చీలు, అధికారులు మాత్రమే మిగిలిన దృశ్యం

ఎర్రగుంట్ల, మార్చి 5: కౌన్సిలర్లు బహిష్కరించడంతో ఎర్రగుంట్ల నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మంగళవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఎర్రగుంట్ల నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే 11.20 అవుతున్నా ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే సమావేశానికి వచ్చారు. చైర్మన్ కూడా రాకపోవడంతో అందరూ ఎదురు చూశారు. చైర్మన్ వచ్చిన తర్వాత కోరం కోసం కొద్దిసేపు అధికారులు వేచి చూశారు. కాగా గత సమావేశంలో తాము వ్యతిరేకించిన అంశాలను, తాము వెళ్లిన తర్వాత ఆమోదించుకుని వాటిని కలెక్టర్‌కు కూడా పంపినట్లు కౌన్సిలర్లు నాగిరెడ్డి, ఆలి, మరికొందరు తెలుసుకున్నారు. ఈ అంశంపై ప్రశ్నించారు. గత సమావేశం మాదిరిగానే ఈ సమావేశంలో కూడా అన్ని అంశాలను మీరే ఆమోదించుకోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశాలకు తమను ఎందుకు పిలిచారంటూ వాకౌట్ చేశారు. ఇకపై తమను సమావేశాలకు పిలవొద్దని ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్ అంటూ బయటికి వెళ్లిపోయారు. ఇది గమనించిన చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేస్తూ బయటికి వెళ్లిపోయారు. దీంతో సమావేశ గదిలో ఖాళీ కుర్చీలు, అధికారులు మాత్రమే మిగిలారు. సమావేశాన్ని వాయిదా వేస్తున్నారా అని కమిషనర్ రామకృష్ణయ్యను అడుగగా అలాంటిదేమీ లేదని మళ్లీ కౌన్సిలర్లు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. అయితే అరగంట వరకు చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ఎవరూ రాకపోవడంతో సమావేశం జరగలేదు. గత సమావేశంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నలుగురు కౌన్సిలర్లు ఈసారి కూడా తమ అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు.

రూ.4కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు

● అదుపుకాని అధికార పార్టీ నేతల భూ దందా ● అడ్డంగా ఆక్రమణలు.. చోద్యం చూస్తున్న అధికారులు

అవకాశం ఉన్నపుడే అడ్డంగా దోచేయాలి. పెట్టుబడి లేకుండా అందినకాడికి సంపాదించుకోవాలనేది అధికార పార్టీ నేతలు బాగా వంటబట్టించుకున్నట్టు ఉన్నారు. బద్వేలు పట్టణంలో యథేచ్ఛగా భూఆక్రమణలకు పాల్పడుతున్నారు. తాజాగా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 1581లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని అధికార పార్టీకి చెందిన ఓ నేత ఆక్రమించారు.


No Objection Certificate

This is to certify that Sri Sura Veeranayana Reddy S/o Pedda Veera Reddy resident of Chennampalli is permitted to run a brick kiln unit in the scheduled land temporarily i.e up to completion of construction of houses in Layouts situated in Chennapalli village, Badvel Mandal under Navarathnalu - Pedalandarikillu Scheme so as to provide the bricks to the beneficiaries of said pertaining to Badvel Municipality at affordable prices. Hence, there is no objection to provide to power connection to the said brick kiln unit on temporary basis.

Note: This is issued only to secure power connection from APSPSDCL so as to run the brick kiln unit and it won't confer any rights to the said individual over scheduled land. Whenever the land is required, the individual may be evicted without any prior notice.

Scheduled Land

Revenue Village	Sy No	Extent in Acres	Boundaries
Chennampalli	1581-P	1.13Acres	East-Land situated in Sy No 1581; West- Road (Part in Sy No 1581); North-Road (Part in Sy No 1581); South-Land belongs to Dabbagunta Padmavathamma & Bhumireddy Krishnaveni

Issued as per the oral instructions of RDO [illegible]

TAHSILDAR
BADVEL

జగనన్న కాలనీలో ఇటుకల తయారీ కోసం ఎన్‌ఓసీ ఇచ్చిన అధికారులు

బద్వేలు, మార్చి 5: బద్వేలు పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండడంతో భూముల విలువ పెరుగుతూ వస్తోంది. దీంతో ఎక్కడ ఖాళీ స్థలం కనపడినా అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తాజాగా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో మరో భూకబ్జా వెలుగుచూసింది. జగనన్న కాలనీకి సిమెంటు, ఇటుకలు వేసేందుకు కరెంటు మీటరు కోసం గత తహశీల్దారు ఎన్‌ఓసీ ఇచ్చారు. జగనన్న కాలనీకి సంబంధించిన సిమెంటు ఇటుకల సప్లై కోసం ఆ స్థలాన్ని తాత్కాలికంగా వాడుకునేందుకు అనుమతి ఇచ్చారు. అయితే ఆ ఎన్‌ఓసీని అడ్డం పెట్టుకుని అధికార పార్టీకి చెందిన ఓ నేత కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు.

సర్వే నెంబరు 1581లో 1.13 ఎకరాల స్థలంఉంది. ఆ స్థలంలో జగనన్నకాలనీలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల కోసం సిమెంటు ఇటుకల తయారీ కోసం తాత్కాలిక అనుమతి ఇచ్చారు. ఈ మేరకు కరెంటు కనెక్షన్ కూడా ఇచ్చారు. దీనికి సంబంధించి అధికారులు 'తాత్కాలిక అనుమతి అని, ఆ స్థలంపై ఎవ్వరికీ హక్కు ఉండదని' స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మేరకు చెన్నంపల్లె లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తి అయింది. అయినా ఆ స్థలాన్ని ఖాళీ చేయకుండా అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ప్రహరీగోడ నిర్మిస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భూమి సుమారు రూ.4కోట్ల విలువ చేస్తుందని సమాచారం. రెండు రోజుల నుంచి ఇక్కడ ప్రహరీగోడ నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో జగనన్న కాలనీలో గుడి నిర్మించుకుంటుంటే రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారని, ఇప్పుడు రూ.4కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. కబ్జాకు పాల్పడుతున్నది అధికార పార్టీ నేత కావడంతో అధికారులు చూసీచూడనట్టు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా, ప్రభుత్వ భూమి ఆక్రమణ గురించి తహశీల్దారు దామోదర్ దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయం నా దృష్టికి రాలేదని అన్నారు. తక్షణమే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణలు అడ్డుకుంటామన్నారు.




ప్రభుత్వ స్థలంలో ప్రహరీగోడ నిర్మిస్తున్న దృశ్యం

నైపుణ్యం పెంచుకునేందుకే శిక్షణ



శిక్షణ పొందుతున్న సివిల్, ఏఆర్ పోలీసులు

సిబ్బందికి శిక్షణలో ఏఆర్ ఏఎస్పీ కృష్ణారావు

కడప క్రైం, మార్చి 5 : రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది వృత్తిపరమైన నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఏఆర్ ఎస్పీ కృష్ణారావు తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో మంగళవారం సివిల్, ఏఆర్ సిబ్బందికి యాంటీరైట్స్ డ్రిల్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు సిబ్బందిలో నైపుణ్యం పెంపొందించేలా ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల వేళ వీరి సమయస్ఫూర్తి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ఈ శిక్షణ మెరుగైన విధులు నిర్వహించేందుకు దోహదపడుతుందని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించే అల్లరిమూకలపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. అనంతరం అల్లరి మూకలపై ఎలా లాఠీచార్జ్ చేయాలి, గ్యాస్ ఎలా ప్రయోగించాలి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్ విరేష్ తదితరులు పాల్గొన్నారు.

చాందినీ బండ్లకు అనుమతి పొందాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జీవన్ గంగనాథబాబు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 5: లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారికి చాందినీబండ్లు కట్టేవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని లక్కిరెడ్డపల్లె సీఐ జీవన్ గంగనాథ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12వ తేదీల్లో గంగమ్మజాతర జరుగుతుందని, ప్రశాంతంగా జరిగేందుకు అన్ని కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చాందినీబండ్లను 10 అడుగుల ఎత్తు కంటే ఎక్కువ ఏర్పాటు చేయకూడదని తెలిపారు. బండి వెనుక అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయొద్దని, కేవలం సంప్రదాయబద్ధంగా చాందినీ బండ్లు ఏర్పాటు చేసుకుని అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకోవాలన్నారు. చాందినీ బండ్ల వద్ద బాణసంచా కాల్చేటపుడు తగిన జాగ్రతలు పాటించాలని అలాగే బండి వచ్చే సమయంలో విద్యుత్ తీగలు బండికి తగలకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దొంగతనాలు, జూదాలు, మద్యం విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులు అదుపులో తీసుకుని అరెస్టు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాతరకు నాలుగు మూలల స్టాండ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ విష్ణువర్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయి


టగ్ ఆఫ్ వార్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మణికంఠ

కడప (స్పోర్ట్స్) మార్చి 5: సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ తెలిపారు. యువత ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవశ్యకత ఉందన్నారు. నెహ్రూ యువకేంద్ర, జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో టగ్ ఆఫ్ వార్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత క్రీడాస్ఫూర్తిని పెంచుకుంటే ధైర్యసాహసాలు పెరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించేందుకు శ్రమించాలన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

టగ్ ఆఫ్ వార్ క్రీడా పోటీలో విజేతగా నిలిచిన శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని, ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతిని పొందారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకులు అశోక్, ఎన్‌వైకె వలంటీర్లు బాలాజీ, కళ్యాణ్, దినేష్, సాయిశ్వర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో జర్నలిస్టుల పాత్ర కీలకం : కమిషనర్

కడప (కలెక్టరేట్), మార్చి 5: రానున్న సాధారణ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని నగరపాలక సంస్థ కమిషనరు ప్రవీణ్‌చంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ఎంసీఎంసీ, మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల్లో మీడి యా పాత్రపై ఎంసీఎంసీ మెంబరు గురప్ప పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి నగర కమిషనరుతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి, ఎంసీఎంసీ మెంబరు సెక్రటరీ వేణుగోపాలరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఇందుకు మీడియా కీలకపాత్ర పోషించాలన్నారు. ఎన్నికల్లో అబ్జర్వర్లు, ఎక్స్‌పెండెచర్ లాగానే మీడియా కూడా ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు పాటించేలా మీడియా యాక్టివ్ రోల్ పోషించాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలని తెలిపారు. ఏదైనా ఒక వార్తను ప్రచురించే ముందు వాస్తవాలు సరి చూసుకుని ప్రచురించాలన్నారు. అవాస్తవ కథనాలు స్ప్రెడ్ కాకుండా ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఐఅండ్ పీఆర్ ద్వారా మీడియాకు తెలియజేస్తామని తెలిపారు.

రాజకీయ పార్టీల ప్రకటనలు, సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సినిమా హాల్లో ప్రకటనలు, ఈ-పేపర్లలో, రేడియోలలో ముందుగా ఎంసీఎంసీ అనుమతి తీసుకొని ప్రచురించాలన్నారు. అసభ్యకరమైన లేదా పరువు నష్టం కలిగించే ఏదైనా హింసను ప్రేరేపించడం, కోర్టు ధిక్కారానికి, దేశ ఐక్యత, సమగ్రతకు భంగం కల్గించే వార్తా కథనాలతో పాటు వ్యక్తిగత విమర్శలు ప్రచురించరాదన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో మస్తాన్ సాహెబ్, సునీల్ సాగర్, ఎన్నికల సూపరింటెండెంట్, సిబ్బంది, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి గండి శివాలయం సంప్రోక్షణ


గండి క్షేత్రంలోని శివాలయం

చక్రాయపేట, మార్చి 5: గండి క్షేత్రంలోని పాపాఘ్ని పడమర దిక్కున వెలసిన శివాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు కిరణ్‌కుమార్, కావలి హరినాథ్, కావలి కృష్ణతేజ, అప్పు రాజిత, శ్రావణ్, అహ్మద్‌ఖాన్, శ్రీహరిలు సమావేశమై ఈనెల 28, 29, 30 తేదీలలో అత్యంత వైభవంగా శివాలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇక్కడ గుహలో వెలసిన శివాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కార్తీక మాసంలో వేలాది మంది మహిళలు స్వామివారిని దర్శించుకొని పాపాఘ్ని నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకునే వారు. అలాగే గండి క్షేత్రానికి వచ్చే భక్తులు తప్పకుండా శివాలయానికి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో శివాలయంలో 70 సంవత్సరాలుగా సేవలందిస్తున్న పఠాన్ రామానంద కబీర్ ఇటీవల మృతిచెందడంతో ఆలయం మూతపడింది. అలాగే 2020లో కురిసిన భారీ వర్షాలకు శివాలయం పాక్షికంగా దెబ్బతింది. అనంతరం కరోనా రావడంతో శివాలయం తలుపులు తెరుచుకోలేదు. ఈ నేపథ్యంలో శ్రీయోగి రామానంద స్వామి చరణ్ సేవా సమితి ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

స్వీపర్స్ సమస్యలు పరిష్కరించాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 5: ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఆయా స్వీపర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బా రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లాలు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల పైబడి ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేయించు కుంటూ గౌరవ వేతనం రూ.6వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, నగర కార్యదర్శి మద్దిలేటి, స్కూలు స్వీపర్లు పాల్గొన్నారు.

హమాలీలకు కూలీ రేట్లు పెంచాలి



పాతబస్టాడు వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 5: మద్యం రవాణా చేసే హమాలీలకు ఎగుమతి కూలీ రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలో హమాలీ కార్మికుల ధర్నాకు మద్దతుగా కడప పాతబస్టాండులో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఎగుమతి కూలీ రేట్ల ఒప్పందం 2024 అక్టోబరు 31తో ముగుస్తుందన్నారు. ఏపీ ఎస్‌బీసీఎల్ యాజమాన్యం కొత్త మద్యం రవాణా ఒప్పందదారులతో కూలీ రేట్లు నిర్ణయించకుండా ఆలస్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా ఎగుమతి కూలీ రేట్లు పెంచి హమాలీలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



వాహనం ఢీకొనడంతో ఒరిగిన విద్యుత్ స్తంభం

సింహాద్రిపురం, మార్చి 5: సింహాద్రిపురం బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం వ్యాన్ విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్న సంఘటనలో పెనుప్రమాదం తప్పింది. సింహాద్రిపురంలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనుల జరుగుతున్న ప్రాంతంలోకి అల్విన్ వ్యాన్ వచ్చింది. గనుల్లో పేలుడుకు ఉపయోగించే సామాగ్రిని తరలించే వాహనం పీలేరు నుంచి హైదరాబాద్‌కు వెళుతూ సింహాద్రిపురంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు. అలాగే మైనింగ్‌కు సంబంధించిన పేలుడు సామగ్రి ఆ వాహనంలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ప్రమాదం కారణంగా సింహాద్రిపురం పట్టణంలో మధ్యాహ్నం 3 నుం చి రాత్రి 9గంటల వరకు విద్యుత్ సరఫరా అంత రా యంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. ఎట్టకేలకు 9గం టలకు విద్యుత్ వచ్చేలా ఆశాఖ అధికారులు కృషిచేశారు.

నేడు సీపీఐ ఉమ్మడి కడప జిల్లా సమావేశం

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 5: స్థానిక రహ్మతీయ ఫంక్షన్ హాలులో బుధవారం సీపీఐ ఉమ్మడి కడప జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ విధానాలపై చర్చించి రానున్న ఎన్నికల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, ఈశ్వరయ్య హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, మార్చి 5: పట్టణంలోని పార్నపల్లె రోడ్డు ప్రాంతాలలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అర్బన్ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్నపల్లె రోడ్డు విస్తరణకు సంబం ధించి కెటులైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నందున ఈ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాసేవకుడు చంద్రబాబు... టీడీపీని గెలిపించండి



భారీ బైకు ర్యాలీగా పెద్దచెప్పలి వెళుతున్న టీడీపీ నాయకులు, వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 5: ప్రజాసేవకుడు చంద్రబాబు అని.. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించి రాష్ట్రఅభివృద్ధికి తోడ్పాటు నందించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామంలో బాబు షూరటీ భవిష్యత్తు గ్యారంటీ క్యార్యక్రమం నిర్వహించారు. ముందుగా కమలాపురంలోని టీడీపీ కార్యాలయం నుంచి పెద్దచెప్పలి వరకు దాదాపు 400 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క ఉద్యోగ అవకాశం కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. అధికార దాహంతో సాధ్యం కాని హామీలు ఇచ్చి ఒక్క పథకం కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. పేదవాడికి సొంతి కల కలగానే మిగిలిందన్నారు. 30 లక్షల ఇల్లు కట్టిస్తామని చెప్పి 32 ఇళ్లు కూడా కట్టించలేదని విమర్శించారు. ఈసందర్భంగా పెద్దచెప్పలిలో తోట వెంకటేశ్వర్లు, ఓ.రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వీరిని పుత్తా నరసింహారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, మంలడ కన్వీనరు రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా కుటుంబ సభ్యుల జోలికొస్తే తాటతీస్తా

వీరపునాయునిపల్లె, మార్చి 5: వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన నా కుటుంబ సభ్యులను బెదరిస్తే తాటతీస్తానని టీడీపీ రాష్ట్ర ఉపా .ధ్యక్షుడు, కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బుసిరెడ్డిపల్లెలో మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ లోకి చేరాయి. వీరికి పుత్తా నరసింహారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ బీసీసెల్ కార్యదర్శి ఓబయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ క్వార్టర్స్ స్థలాన్ని పరిరక్షించాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర

కడప(రూరల్), మార్చి 5 : కడప నగరంలోని వందల కోట్ల విలువైన జిల్లా పరిషత్తు క్వార్టర్స్‌ను ఉన్నపలంగా తొలగించి చదును చేయడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయని.. దీనిపై కలెక్టర్ తక్షణమే స్పందించి జడ్పీ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ బృందం జడ్పీ కార్వర్టర్స్ స్థలాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ వందల కోట్ల విలువపైన జడ్పీ క్వార్టర్స్ స్థలాన్ని కొంతమంది వ్యక్తులకు లీజ్ పేరుతో కారుచవకగా కట్టబెట్టే ఆలోచనలో జడ్పీ యంత్రాంగం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని.. ఈ చర్యలను విడనాడాలన్నారు. ఇదివరకే కొందరి స్వార్థపర ప్రయోజనాల కోసం కోట్ల విలువైన జిల్లా పరిషత్ స్థలాలు ధారాదత్తం అయ్యా యని.. వీటిని స్వాధీనం చేసుకోకపోగా ఉన్న స్థలాలను కారుచవకగా కట్టబెట్టేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆస్తులు ప్రజాప్రయోజనం కోసం కాకుం డా వ్యాపారం పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండా కట్టబెట్టాలని చూస్తే సహించేదిలేదన్నారు. జిల్లా కేంద్రంలో లీజుల పేరుతో ఇప్పటికే తీసుకున్న ప్రభుత్వ స్థలాలు వారి ఆధీనంలో బందీ అయ్యాయన్నారు. ఇలానే లీజుల పురుతో ప్రభుత్వ స్థలాలను ఇచ్చుకుంటూ పోతే రానున్న రోజుల్లో ప్రజాప్రయోజనం కోసం, ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటు కోసం సెంటు స్థలం లేక అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ లీజ్ మాటున జరుగుతున్న అడ్డగోలు వ్యవహారంపై, జడ్పీలో నిర్మిస్తున్న కట్టడాలు, పనులపై సమగ్ర విచారణ జరిపించి దోషులపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి, సహాయ కార్యదర్శులు ఎస్.వెంకటశివ, కె.సి. బాదుల్లా, నాయకులు పి.మల్లికార్జున, వలరాజు, లింగన్న, రామ్మోహన్‌రెడ్డి, నాగేంద్ర, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల చైతన్యంతోనే సమాజంలో మార్పు

కడప (మారుతీనగర్), మార్చి 5: సమాజంలో మార్పు రావాలంటే మహిళలు చైతన్య వంతులు కాగలిగినపుడే సాధ్యమవుతుందని అమరావతి జాయింట్ యాక్షన్ కమిటీ మహిళావిభాగం చైర్‌పర్సన్ మేరీ విజయకుమారి పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భాన్ని పురష్కరించుకుని ఏపీఎస్‌ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణించగలిగేలా ముందుకురావాలన్నారు. వంటి ఇంటికే మహిళలు పరిమితమయ్యే రోజులు పోయాయని, ప్రతి మహిళ విద్యావంతురాలుగా మారినపుడే ఆయా కుటుంబాలు ప్రగతిబాట పట్టగలవన్నారు. జేఏసీ జనరల్ సెక్రటరీ పి.విజయ, సీఓ చైర్‌పర్సన్ శారదాదేవి, అనురాధ, జిల్లా సెక్రటరీ సుజాత, పద్మావతి, శాంతకుమారి, పలువురు ఆర్టీసీ మహిళా ఉద్యోగులు పాలొన్నారు.

పేదలకు అన్నదానం

కడప (కల్చరల్), మార్చి 5: అన్ని దానాలకన్నా పేదవారి ఆకలి తీర్చగలిగే అన్నదానం చాలా మిన్న అని సీఎస్ఐ పాఠశాల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పేదవారికి కనీసం వారంలో ఒక్క పూట కడుపు నిండేలా అన్నదానం చేయాలనే ధ్యేయంతో 1978 సీఎస్ఐ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద పేదలకు ఉచిత అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రఫిక్, విజయ్‌కుమార్, అబ్దుల్, తోట సుధాకర్, కిరణ్, శ్రీనివాసులు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యు ఆధ్వర్యంలో స్టాలిన్ వర్ధంతి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 5: రష్యా విప్లవ యోధుడు స్టాలిన్ అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న తెలిపారు. మంగళశారం కడప నగరం ఐటీఐ కళాశాలలో స్టాలిన్ 71వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో స్టాలిన్ పాత్ర చెరగని ముద్ర అని, మానవ జాతికి దిశా నిర్దేశనం చేసిన నాయకుల్లో స్టాలిన్ ఒకడని తెలిపారు. పీడీఎస్‌యూ నాయకులు అల్లాబకాష్, మనోజ్, అంజి, శివ, ఈశ్వర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల ఆటల పోటీలకు అనూహ్య స్పందన



క్రీడా పోటీలను పరిశీలిస్తున్న ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

కడప(కలెక్టరేట్), మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురష్కరించుకుని ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలకు అనూహ్య స్పందన లభించింది. మంగళవారం జియోన్ కళాశాలలో చివరి రోజున నిర్వహించిన ఆటల పోటీల్లో పెద్ద ఎత్తున మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. లెమన్ అండ్ స్పూన్, వాలీబాల్ టెన్నీకాయిట్ పోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ఆటల పోటీలు మహిళా ఉద్యోగుల్లో వత్తిడిని తగ్గించి, మానసిక ఉల్లాసాన్ని కల్గించేందుకు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలాజ్యోతి, కన్వీనరు భారతితో పాటు ఎన్జీఓ నేతలు రవికుమార్, ప్రసాద్ యాదవ్, నిత్యపూజయ్య, పద్మనాభం, సునీత తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి అమ్మవారు, రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు

కడప (కల్చరల్) మార్చి 5: నగర బిల్టప్ సమీపంలో గల విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాలైన నెల్లూరు, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను భక్తి శ్రద్ధలతో వెలిగించి ఆ తల్లి సేవలలో తరించారు. ఇలా చేయడం వలన వివాహాలు కాని వారికి వివాహాలు, అనుకున్న పనులు సకాలంలో పూర్తి కావడం జరుగుతుందని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రి రోజైన శుక్రవారం అమ్మవారికి విశేష అభిషేకం, ఉదయం 10 గంటలకు మల్లికార్జునస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు తెలిపారు. భక్తులు మల్లికార్జున సమేత విజయదుర్గాదేవిని దర్శించుకోవాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఎస్‌బీఐ సేవలు



ఆర్టీసీ కాలనీలో బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ జనరల్ మేనేజరు నవీన్‌చంద్రఝా

కడప (ఎడ్యుకేషన్), మార్చి 5: ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎస్‌బీఐ మెరుగైన సేవలను అందిస్తున్నట్లు ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజరు నవీన్‌చంద్రఝా తెలిపారు. మంగళవారం కడప నగరం ఆర్టీసీ కాలనీలో ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఎస్‌బీఐ అందుబాటులో బ్రాంచ్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ కాలనీతో పాటు ఓల్డ్ బైపాస్ రోడ్డు, రెడ్డికాలనీ, క్రిష్ణదేవరాయ్‌నగర్‌లో కూడా బ్రాంచ్‌లను ప్రారంభించామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు డీజీ ఎం లేఖామీనన్, కడప రీజనల్ మేనేజరు నారాయణరావు, బ్రాంచ్ మేనేజరు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ ద్వారానే రాష్ట్రాభివృద్ధి : బీటెక్ రవి



వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

వేంపల్లె, మార్చి 5: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి అన్నారు. వేంపల్లెలోని ఇమామ్‌నగర్, గండిరోడ్డు, రజక కాలనీ, సంగం వీధి, గౌరీనగర్, కాపు వీధి, వడ్డెర వీధి తదితర ప్రాంతాలలో మంగళవారం బీటెక్ రవి, ఆయన సతీమణి లతారెడ్డి బాబు ష్యూరిటీ నిర్వహించారు. వారికి ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోను పంపిణీ చేశారు. బీటెక్ రవి మాట్లాడుతూ టీడీపీని ఆదరించి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. మైనార్టీ కార్పొరేషన్ మాజీడైరెక్టర్ షబ్బీర్, నిమ్మకాయల దర్బార్, జయచంద్రా రెడ్డి, నామా వేమకుమార్, పసుపులేటి వీరభద్ర, జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి, మాజీ సర్పంచు శ్రీరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, నాగభూషణం, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక : వేంపల్లెలోని సంగం వీధిలో వైసీపీ నుంచి టీడీపీలోకి పలు కుటుంబాలు చేరాయి. యడాల రామచంద్ర, యడాల శ్రీనివాసులు, జగదీష్, ప్రసాద్ తదితర పలు కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీటెక్ రవి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పటిష్టత కోసం కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు నిస్తామన్నారు.

విధ్వంసానికి ప్రతిరూపం వైసీపీ పాలన

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జి మాధవీరెడ్డి



బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 5: జగన్‌రెడ్డి పాలన అంతా దోపిడీ, దౌర్జన్యాలు, విధ్వంసానికి ప్రతిరూపమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరం 38వ డివిజన్‌లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అలాగే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాలుగన్నర సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. కేవలం దాచుకోవడం దోచుకోవడం తప్ప అభివృద్ధి ఎక్కడా కానరాలేదని విమర్శించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబును గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో షేక్ ఆదిల్, ఆరిఫ్, నాసరుద్దీన్, ఫైజల్, అనీఫ్, ఆసిఫ్, నిజాముద్దీన్, షాబుద్దీన్, నయీం, సుభాష్, గిరి, సుబ్బారెడ్డి, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో... : కడప నగరం 20వ డివిజన్‌లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి టీడీపీ చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సురేష్, నరసింహ, సుదర్శన్‌రెడ్డి, ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, కర్నాటి నాగభూషణం, తిరుమలేశ్, వేంపల్లె రాజా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలి

రాష్ట్రానికి సీఎంగా మళ్లీ చంద్రబాబురావాలని ప్రజలు కోరుకుంటున్నారని పొన్నవోలు రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరం 43వ డివిజన్ రవీంద్ర నగర్‌లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ కరపత్రాలను ఇంటింటికీ పంచిపెట్టి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి చెన్నంశెట్టి మురళి, నాయకులు గంపా వీరయ్య, జనార్ధన్‌రెడ్డి, మాధవ, మంచాల రమేష్, గౌడు గునూరు రాజశేఖర్, ప్రజలు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం

● టీడీపీ నాయకులు అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అమీర్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 5: చంద్రబాబు నాయుడును సీఎం చేయడమే తమ లక్ష్యమని టీడీపీ నాయకులు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం రహ్మతీయ ఫంక్షన్ హాలులో అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో టీడీపీకి సంబంధించి ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న నాయకులంతా సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. కడపలో టీడీపీ జెండా ను ఏ విధంగా ఎగరవేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోగలమనే కార్యాచరణపై చర్చించామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు కడపలో పార్టీ జెండాను ఎగురవేసేందుకు అడుగులు వేస్తామన్నారు. తమ కష్టనష్టాలు, కడపలో పార్టీ పరిస్థితిని చంద్రబాబుకు తెలియజేస్తామని తెలిపారు. పార్టీ అధినేతపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. భవిష్యత్తులో కార్యాకర్తల అభీష్టం మేరకు ముందకు సాగుతామని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

వేరుశనగలో కలుపు మొక్కలు లేకుండా చేయాలి



తెగులు సోకిన వేరుశనగ మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పులివెందుల, మార్చి 5: వేరుశనగలో మొవ్వకుళ్లు, కాండం కుళ్లు తెగులు ఎక్కువగా ఉందని... నివారణకు పంటలో కలుపుమొక్కలు (వయ్యారిభామ) లేకుండా చేయాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మంగళవారం తొండూరు మండంలోని బూచుపల్లె, మల్లేల, సంతకొవ్వూరు గ్రామాలలో రబీ (నవంబరు, డిసెంబరు)లో సాగుచేసిన వేరుశనగ పంటను వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్, డాక్టర్ భాగవత ప్రియలు పరిశీలించారు. మొవ్వకుళ్లు ఎక్కువగా సోకిన చోట పంట పూర్తిగా దెబ్బతిన్న, కొన్నిచోట్ల పైరు బాగా పచ్చగా ఉన్నా కాయల సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు గమనించారు. ఈ వైరస్ బారిన పడ్డ మొక్కలను తీసి కాల్చి వేయడంతో పాటు వైరస్ వ్యాపించకుండా మందులను పిచికారి చేయాలని సూచించారు. అలాగే రబీలో సాగుచేసే వేరుశనగకు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

‘రోడ్లకే గతిలేదు.. జిల్లాకో ఎయిర్‌పోర్టు కడతాడంట!’

● తుగ్లక్‌ను తలపిస్తున్న జగన్ వ్యాఖ్యలు ● మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ● ముమ్మరంగా ‘బాబు ష్యూరిటీ’

ప్రొద్దుటూరు ,మార్చి 5 : రాష్ట్రంలో రోడ్లేయడానికి గతిలేదు కానీ, జిల్లాకో ఎయిర్‌పోర్టు కడతానంటున్న జగన్ మాటలు పిచ్చి తుగ్లక్‌ను తలపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం స్థానిక దొరసానిపల్లెలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి టీడీపీ కడప పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, బచ్చల వీర ప్రతాప్, వంగల నారాయణ రెడ్డి , రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ పాత కోట భాస్కర్ రెడ్డి సింగరయ్య చెంద్రాయుడు వరద సుధాకర్ గుర్రం సుబ్బయ్య సాధు ప్రసాద్ రబ్బా శ్రీరాములు నందం వెంకట సుబ్బయ్యకాటిరెడ్డి, పాణ్యం వెంకట సుబ్బయ్య, బ్రహ్మయ్య అరవ రాజా నరాల భాస్కర్‌రెడ్డి మాజీ కౌన్సిలర్లు వద్ది బాలుడు , కాకుమాని ఆనంద్, ఎర్రన్న ,తలారి పుల్లయ్య పాములేటి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు ఎప్పుడో ఖాయమైంది

టీడీపీ గెలుపు ప్రజల్లో ఎప్పుడో ఖాయమైందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రెడ్డి అన్నారు.కొత్తపల్లె పంచాయతీ మత్స్య కాలనీలో మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ బాబుల్ రెడ్డి రాజు పాలెం మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డి, సహదేవరెడ్డి, మల్లికార్జున రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలూరులో ..

కాశినాయన: ఉప్పలూరు గ్రామంలో మంగళవారం బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జారోశన్న జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మురుకూటి రాజారెడ్డితో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రోహిత్‌రెడ్డి, పాలకొలను పోలిరెడ్డి, నర్సాపురం సర్పంచ్ చిన్నఖాజావలి, ఉల్లి నాగరాజు, హోండా రవీంద్రారెడ్డి, లక్కిరెడ్డి శ్రీనివాసుల,బోవిళ్ల నరసింహారెడ్డి, సోమిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వీరనారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి, ఉస్సేన్‌పీరా, సిద్దారెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుబ్బరాయుడు పుల్లయ్య, బాలగురయ్య, గైడు పవన్, మహబూబ్‌బాషా తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలూరులో..

రాజుపాలెం: మండల పరిధిలోని కూలూరు గ్రామంలో మంగళవారం టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి ఇంటింటికీ వెళ్లి ఆరు పథకాల గ్యారంటీ పత్రాన్ని ప్రజలకు అందించారు. సైకిలు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ తదితర కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సహదేవరెడ్డి, మండల కన్వీనరు విశ్వనాదరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గుత్తి దస్తగిరి, సౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దొరసానిపల్లె పంచాయతీలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కొండారెడ్డి



కొత్తపల్లె పంచాయతీ మత్స్యకాలనీలో ప్రవీణ్‌రెడ్డి ప్రచారం



ఉప్పలూరులో ఇంటింటి ప్రచారంలో బొజ్జారోశన్న



కూలూరులో ప్రచారం చేస్తున్న మౌనికారెడ్డి తదితరులు

‘త్వరలో టీడీపీకి పూర్వ వైభవం’

● వందలాది కుటుంబాలు టీడీపీలో చేరిక

అట్లూరు, మార్చి 5: తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని, ఈసారి బద్వేలులో టీడీపీ జెండా ఎగురవేస్తామని యువనాయకుడు రితీష్‌రెడ్డి వ్యాఖ్యానిం చారు. అట్లూరు మండల వైసీపీ ఎంపీపీ పుత్తా రమాదేవి, మండల వైసీపీ ఇన్‌చార్జి రెడ్డయ్య ఆధ్వర్యంలో మండలంలోని 12 పంచాయతీలకు చెందిన 600 కుటుంబాలు మంగళవారం వైసీపీలో చేరాయి. అట్లూరు క్రాస్ రోడ్డులో నిర్వహించిన సమావేశంలో రితీష్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అట్లూరు మండలంలో ప్రభుత్వ భూముల కబ్జా పరి పాటిగా మారిందన్నారు. ఎటువంటి అభివృద్ధి చేయకుండా దేనికి సిద్ధమయ్యారని వైపీపీ నేతలను ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. తెలుగుగంగ కాల్వ పూర్తి చేసి అట్లూరు మండల ప్రజలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. హూకిల్డ్ బాబాయి ఫ్లెక్సీలను ప్రదర్శించారు. బద్వేలు నియోజకవర్గ అభ్యర్థి బొజ్జా రోశన్నకు ఓటు వేసి గెలిపించాలని కార్యకర్తలను కోరారు. అట్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నరసింహనాయుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రసాద్, శివయ స్వామిపాల్గొన్నారు.

మైలవరం: మండల పరిధిలోని చిన్నకొమెర్ల గ్రామంలో వైసీపీకి చెందిన 100 కుటుంబాల వారిని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూ పేశ్‌రెడ్డి మంగళవారం టీడీపీలోకి ఆహ్వానించారు. కర్నాటి రామాంజనేయరెడ్డి, కర్నాటి తిరుపాల్‌రెడ్డి, పోలా పుల్లారెడ్డి, పోలా పవన్‌కుమార్‌రెడ్డి, మునిప్రసాద్‌రెడ్డి, కె.ఎస్ రామాంజుల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, గురురెడ్డి, సంజీవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, బబ్లూ, దామోదర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మోహన్ రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, పాపిరెడ్డి, శివారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, శేఖర్, అమర్నాథ్‌రెడ్డి, మంగలి ప్రసాద్, పరమేశ్వర రెడ్డి, శంకర్‌రెడ్డి, గుర్రప్ప వెంకటసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, భరత్‌రెడ్డి, బార్గవరెడ్డి, నాగేంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి తదిత రులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, సీనియర్ నాయకులు కాటిరెడ్డి, కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు, మైలవరం రాజారెడ్డి, గణేష్‌రెడ్డి, జనసేన నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటూ టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.



అట్లూరు: హూకిల్డ్ బాబాయి ఫ్లెక్సీలతో రితీష్‌రెడ్డి



మైలవరం: టీడీపీలో చేరిన వారితో భూపేశ్‌రెడ్డి

8 న బాలప్పకోనలో శివపార్వతుల కల్యాణం

కొండాపురం, మార్చి 5: మండలంలోని బాలప్పకోన లో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయనిర్వాహకుడు మిట్టాభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన చేస్తున్నట్లు వివరించారు. గండికోట ప్రాజెక్టులో నీళ్లు తగ్గడంతో బొందలదిన్నె గ్రామం నుంచి సంకేపల్లె మీదుగా పాత దారిలో కోనకు చేరవచ్చునని, భక్తులు ఈ కార్యక్రమంలో విరివిరిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కొండాపురంలో మూడు ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రాలు

కొండాపురం, మార్చి 5: మండలంలోని కొండాపురం జడ్పీ హైస్కూల్, శివసాయి హైస్కూల్, గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో ఓబులేసు తెలిపారు. మండలంలో మొత్తం 453 విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు . కాగా ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో తాళ్లప్రొద్దుటూరులో పరీక్షా కేంద్రాన్ని ఎత్తివేశారు.

ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన

జమ్మలమడుగు, మార్చి 5: ఓటు హక్కుపై ప్రజలకు జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్ అవగాహన కల్పించారు. మంగళవారం రాత్రి జమ్మలమడుగు మండలంలోని పెద్దదండ్లూరు గ్రామాన్ని పోలీసు అధికారులు సందర్శించారు. ప్రధాన సెంటరులో గ్రామ సభ నిర్వహించి ఎన్నికల్లో ప్రజల బాధ్యత, ఓటు హక్కు తదితర అంశాలు తెలియజేశారు. పోలింగ్ బూతులు సందర్శించి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డీఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్ పోలీసు అధికారులు, సిబ్బంది, పెద్దదండ్లూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఫర్నిచర్ విరాళం

పోరుమామిళ్ల, మార్చి 5 : పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెంగమాంబ స్కూలు ఛైర్మన్ గుర్రం పుల్లప్పనాయుడు రూ.25 వేలు విలువైన 30 కుర్చీలు, బీరువా విరాళమిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశరావు సమక్షంలో పుల్లప్పనాయుడును సన్మానించారు. ఈ సందర్భంగా పుల్లప్పనాయుడు మాట్లాడుతూ ఈ కళాశాల నాక్‌లో మంచి గ్రేడ్ సాధించి గుర్తింపు పొందాలన్నారు. తాను ఈ స్థాయిలో ఉండడానికి తన మామ పచ్చా చిన్న వెంగయ్య స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో పీరయ్య, శ్రీనివాసులు, పర్వీన్, ఈశ్వరయ్య, సరిత పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలి

పోరుమామిళ్ల, మార్చి 5 :ఎన్నికల వేళల్లో ప్రజలు ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో కలిసిమెలిసి ఉండాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచిరు. మంగళవారం రాత్రి పోరుమామిళ్లలోని ఉద్దికట్ట వీధిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉండాలన్నారు.

ఇంటిపట్టాలు పంపిణీ

మైదుకూరు, మార్చి 5 : జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు శాసనసభ్యుడు శెట్టిపల్లె రఘురామిరెడ్డి మంగళవారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిపొందిన మహిళలను పిలిపించి పట్టాలను అందచేశారు. పదేళ్ల తరువాత లబ్ధిదారులకు ఇళ్లపై హక్కులు లభిస్తాయన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి

చాపాడు, మార్చి 5: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సంపాదించుకోవాలని కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి అన్నారు. సీబీఐటీ కాలేజీలో మంగళవారం రాత్రి కాలేజ్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠాలను ప్రతిరోజు విద్యార్థులు రెండు గంటలపాటు చదువుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని వారి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులరెడ్డి, రవీంద్రకుమార్, డైరెక్టర్ లోహిత్‌రెడ్డితోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్

పోరుమామిళ్ల, మార్చి 5 :పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలో చిదానందనగర్‌లో మోటరు కాలిపోవడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ యనమల సుధాకర్ మోటరును మరమ్మత్తులు చేయించడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

‘రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసిన జగన్’



ఎంజీ ఆటో నగర్‌లో ప్రచారంలో సీఎం సురేష్ నాయుడు

ప్రొద్దుటూరు ,మార్చి 5 : ఒక్కసారి అధికారమివ్వాలని వేడుకున్నందుకు రాష్ట్ర ప్రజలు గద్దెమీద కూర్చోపెడితే రాష్ట్రంలోని అన్ని వర్గాల భవిష్యత్తును సర్వనాశనం చేశాడని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్‌నాయుడు మండిపడ్డారు. స్థానిక మహాత్మగాంధీ ఆటో నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ ఛైర్మన్ వీఎస్ ముక్తియార్ , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, ఖలీల్ దండపాణి సంస్థల అధినేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ భవనానికి స్థలం కేటాయించాలి

బద్వేలు, మార్చి 5: పట్టణంలో బీసీ భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం సిద్ధవటం రోడ్డులోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేశారు. జ్యోతిరావు పూలే , సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ జనాభాలో 50 శాతం పైగా ఉన్న 139 కులాల వెనుకబడిన తరగతుల వారు బద్వేలు పట్టణంలో సమావేశాలు, శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు అనువైన ప్రభుత్వ స్థలం ఇవ్వాలని కోరుతున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి బాబు, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షుడు హనుమంతరావు, బీసీ.రమణ, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు పిచ్చయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామ సుబ్బయ్య యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ యాదవ్, మనోజ్, కత్తి బ్రహ్మయ్య, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

పేదలకు ప్రభుత్వ భూములు ఇవ్వాలి

పోరుమామిళ్ల, మార్చి 5 : అక్కల్‌రెడ్డిపల్లె, తుఫానగర్ గ్రామాల్లోని భూమి లేని పేదలందరికీ భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం అక్కల్‌రెడ్డి, తుఫానగర్‌లోని భూమి లేని పేదలతో భూ పోరాటం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కల్‌రెడ్డిపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబరు 1883, 1884లో దాదాపు 500 ఎకరాల్లో భూమిలేని పేదలకు కుటుంబానికి 3 ఎకరాల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టరు, బద్వేలు ఆర్డీవో పోరుమామిళ్ల తహసీల్దారుకు అర్జీలు ఇచ్చినా భూ పంపిణీ చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా భూమిలేని పేదలకు 3 ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని సాగు చేసున్న వారిపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.



భూమిని చదును చేసుకుంటున్న వ్యవసాయ కార్మికులు

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం

మైదుకూరు, మార్చి 5: మైదుకూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాయపల్లెలో మంగళవారం । పెద్దమ్మ ఆలయ 14వ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం అమ్మవారికి పూజా కార్యక్రమాలతో పాటు కుంకు మార్చన నిర్వహించారు. ఆవరణలో మహిళలు కోలాటం నిర్వహించారు. అనంతరం న్యూ కేటగిరి వృషభాలతో బండలాగుడు పోటీలు నిర్వహించగా, మొదటి, రెండో బహుమతులను నంద్యాల జిల్లా యస్ కొత్తూరుకు సుబ్రమణ్యంశ్వర రెడ్డికి చెందిన బీరం బుల్స్ గెలుచుకోగా, మూడవ బహుమతిని ప్రొద్దుటూరుకు చెందిన మార్తల వెంకట సుబ్బారెడ్డి వృషభాలు, నాల్గవ బహుమతిగా తెలంగాణలోని రాయవరానికి చెందిన అనస్యరెడ్డికి చెందిన వృషభాలు, 5వ బహుమతి బెస్తవారిపల్లెకు చెందిన గాండ్లపెంట జతిస్ వృషభాలు, 6వ బహుమతి పెద్దశెట్టిపల్లెకు చెందిన చిన్న నాగయ్య వృషబాలు గెలుచుకున్నాయి.



ప్రత్యేక అలంకారంలో పెద్దమ్మతల్లి

ఎన్ఎంయూ వ్యవస్థాపకుడికి నివాళి

జమ్మలమడుగు, మార్చి 5: నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు, రాజీవ్‌రత్న అవార్డు గ్రహీత పి.రామమోహన్‌రావు 19వ వర్ధంతి సందర్భంగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం ఆయన చిత్రపటానికి కార్మికులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి శివుడు, కాంతయ్య, నాగేంద్ర, రీజినల్ కమిటీ మెంబర్ శ్రీను, గ్యారేజీ కార్యదర్శి ఎస్ఎంవలి, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు

బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాపోరు

మైదుకూరు, మార్చి 5 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో బీజేపీ తలపెట్టిన ప్రజాపోరు కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచనూరు సుబ్బరాయుడు నిర్వహించారు. ప్రొద్దు టూరు రోడ్డు, రెడ్డికాలనీ, మూలబాట, తదితర వీధుల్లో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలను అందుతున్నాయా లేదా అనే అడగడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలపై కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామక్రిష్ణ, దేవేంద్ర, కిషోర్, శేఖర్‌రెడ్డి, హరి, రాయల్ శీను తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి తిరుగుతున్న బీజేపీ నాయకులు

వాటర్ ప్లాంట్ పనులు నిలిపివేయాలి

జమ్మలమడుగు, మార్చి 5: మండలంలోని మోరగుడి గ్రామం శ్రీరాముల పేటలో జమ్మిచెట్టు సమీపంలో రాణి కాలువను ఆక్రమించి కొందరు వైసీపీ నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్లు సమాచారం. కాగా, ప్రభుత్వ స్థలంలో వాటర్‌ప్లాంట్ నిర్మించడం తగదని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై జమ్మలమడుగు ఎంపీడీవో ముజఫర్ రహీంను ప్రశ్నించగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, ఆరా తీసి చర్యలు తీసుకుంటామని వివరించారు.



రాణి కాలువ పక్కన వాటర్ ప్లాంట్‌కోసం పనులు చేస్తున్న కూలీలు

‘కాంగ్రెస్ పాలనలోనే ఉగ్రదాడులు’

పోరుమామిళ్ల, మార్చి 5 : కాంగ్రెస్ పాలనలో ఉగ్రవాద దాడులు ఎక్కువని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టిశ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉగ్రదాడులు తగ్గిపోయాయన్నారు. ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ఉగ్రవాదులకు అనుకూల వాతారవణం ఏర్పిందన్నారు. కర్ణాటకలో జరిగిన బాంబు పేలుళ్లలో జగిత్యాలకు చెందిన ఖలీబ్ హస్తం ఉందని తేలిందన్నారు. జగిత్యాల కూడా మరో పాతబస్తీగా తరాయ్యే పరిస్థితులు న్నాయని, అక్కడ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం గమనార్హమన్నారు. కాంగ్రెస్‌కు దేశ క్షేమం కన్నా వారి పార్టీ మనుగడే ముఖ్యమన్నారు.